క్లుప్తంగా

చురుగ్గా క్లోరినేషన్, పారిశుధ్య పనులు



బర్లిలో నూతిలో క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

బలిజిపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో ఈఓపీఆర్‌డీ, కార్యదర్శుల ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు, క్లోరినేషన్ పనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్‌డీ రవికుమార్ మాట్లాడుతూ, రానున్నది వర్షాకాలం కావడంతో అంటువ్యాధులు ప్రబలకుండా కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించడంతో పాటు తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయిస్తున్నామని చెప్పారు. ఈ మేరకు బర్లిలో గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులను శనివారం ఆయన పరిశీలించారు.

జగన్నాథ రథయాత్ర తొలిఘట్టం ప్రారంభం



కన్ను కడుగుట కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్మన్ జయబాబు, తదితరులు

పార్వతీపురం టౌన్: జగన్నాథ రథయాత్ర తొలి ఘట్టమైన కన్ను కడుగుట కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించినట్లు గ్రూప్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి ప్రసాద్ తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ జయబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఓ ప్రసాద్ మాట్లాడుతూ, మూడు సంవత్సరాలుగా రథయాత్రకు రథం లేదని.. ఈ ఏడాది దాతల సహాయంతో నూతన రథం సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఏడాదీ రథయాత్రకు ముందు కన్ను కడుగుట కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

నేడు జాబ్‌మేళా..

పార్వతీపురం: పట్టణంలోని భాస్కర్ జూనియర్ కళాశాలలో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమేజాన్ వేర్‌హౌస్(చెన్నై)లో ప్యాకింగ్, స్కానింగ్, లోడింగ్, సార్టింగ్, తదితర విభాగాలలో ఉద్యోగాలు కల్పిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి ఆపై చదివిన నిరుద్యోగ యువత తమ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కళాశాల ప్రతినిధులు కోరారు.

మొలకెత్తని విత్తనాలు

- ఆందోళనలో రైతన్నలు



మొక్కజొన్న విత్తనాలకు తడి అందిస్తున్న రైతు

సాలూరు రూరల్: మండలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మొక్కజొన్న, పత్తి విత్తనాలు మొలకెత్తలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూన్ నెల తొలి వారంలో కురిసిన అడపాదడపా వర్షాలకు రైతులు పత్తి, మొక్కజొన్న విత్తనాలు నాటారు. అయితే ఆ తర్వాత నుంచి వర్షం లేకపోవడంతో మొలకలు రాలేదు. రుతుపవనాలు ప్రవేశించాయని వాతావరణ శాఖాధికారులు ప్రకటనలు ఇవ్వడంతో విత్తనాలు వేశామని రైతులు చెబుతున్నారు. తొలిదశలోనే ఆర్థిక భారం తప్పలేదని వాపోతున్నారు.

పంటల పరిశీలన



శివరాంపురంలో మొక్కజొన్న మొలకలు పరిశీలిస్తున్న ఏఓ అనురాధ, తదితరులు

సాలూరు రూరల్: మండలంలోని శివరాంపురంలో రైతులు సాగు చేస్తున్న పత్తి, మొక్కజొన్న పంటలను ఏఓ అనురాధ శనివారం పరిశీలించారు. వర్షాభావంతో పాటు ఎండలు తీవ్రంగా ఉండడంతో వేసిన విత్తనాలు మొలకెత్తలేదని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో మొలకలు రావడానికి ఏఓ అనురాధ పలు సూచనలు చేశారు. పరిశీలనలో వీఏఏ పి. వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పనుల పరిశీలన

కొమరాడ: మండలంలోని పెదఖేర్జిల, రేగులపాడు, పూర్ణపాడు, సీతమాంబపురం, కొత్తవలస గ్రామాల్లో జరుగుతున్న జల్ జీవన్ మిషన్ పనులను గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం డీఈ కె.నాగేశ్వరరావు శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్ ద్వారా తాగునీరు అందిస్తున్నామన్నారు. ఆయన వెంట ఏఈ నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వైభవంగా జగన్నాథుడికి జ్యేష్ఠాభిషేకం

పాలకొండ/పాలకొండ రూరల్: జగములనేలు జగన్నాథుని రథోత్సవానికి సాంప్రదాయబద్ధంగా అంకురార్పణ జరిగింది. ఒడిశా పూరీ దేవస్థానం మాదిరి స్వామివారి జ్యేష్ఠాభిషేక వేడకలు వైభవంగా నిర్వ హించారు. దేవాదాయ శాఖ కార్యనిర్వాహణాధికా రి సర్వేశ్వరరావు నేతృత్వంలో అర్చకులు జగన్నాథ, బలభద్ర, సుభద్ర, సుదర్శనలు (చతుర్థా మూర్తులు)లకు పుణ్యజలాలతో శనివారం అభిషేకాలు చేశా రు. స్వామివారి కనులను కడిగారు. అనంతరం చీక టి గదికిలోకి చేర్చారు. ఏడాదికి ఒకసారి నిర్వహించే ఈ పుణ్య కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పోటెత్తారు. వచ్చే నెల 7 నుంచి 17 వరకు జగన్నథు ని రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల సమయంలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న జైయింట్ వీల్ నిర్వహణకు రూ.50 వేలు, లడ్డూ, పులిహోరా (ప్రసాదాలు) విక్రయాలకు రూ.5 వేలు ప్రథమ ధరావత్తు చెల్లించి ఈనెల 24న జరగనున్న బహిరంగ వేలంలో పాల్గొనవచ్చనని, పాత బకాయిలు ఉండరాదని ఈఓ తెలిపారు.



వీరఘట్టం: జగన్నాథస్వామికి సుగంధ ద్రవ్యాలతో శుద్ధిస్నానం చేయిస్తున్న అర్చకుడు లింగరాజ్‌రథో

వీరఘట్టం: పట్టణంలోని మందిరం వీధిలో వెలసిన జగన్నాథస్వామికి జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు లింగరాజ్‌రథో స్వామివారి కనులను శుభ్రం చేశారు. అనంతరం చీకటి గదిలోకి స్వామిని తరలించారు. 15 రోజుల పాటు స్వామివారు చీకటి గదిలో విశ్రాంతి తీసుకుంటారని, అనంతరం అమావాస్య రోజున శుద్ధి స్నానం చేసిన తరువాత రథయాత్రకు బయలుదేరుతారని లింగరాజ్‌రథో తెలిపారు. జూలై 6న నేత్రోత్సవం, 7వ తేదీ నుంచి తొమ్మిది రోజుల పాటు జగన్నాథస్వామి రథయాత్ర వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 11న హీరాపంచమి, 15న మారు రథయాత్ర ఉంటుందన్నారు.



పాలకొండ రూరల్: భక్తుల పూజలు అందుకుంటున్న జగన్నాథుడు

చెరువు గట్లపై టేకు, పామాయిల్ ప్లాంటేషన్

సీతానగరం: ఉపాధి హామీ పథకంలో భాగంగా అభివృద్ధి చేసిన చెరువు గట్లపై పంచాయతీలకు ఆదాయం వచ్చేలా టేకు, పామాయిల్ మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను అన్నారు. మండలంలోని తామరఖండి, రామవరం, కృష్ణారాయపురం గ్రామాల్లోని కోనేరులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇప్పటికే జానుమల్లువలస, అప్పయ్యపేట మంచినీటి కోనేరులను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఆయా కోనేరులతో పాటు దూరప్రాంతాల్లో ఉన్న చెరువుగట్లపై ఫలసాయాన్నిచ్చే మొక్కలు వేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సొంత భూములున్న చిన్న, సన్నకారు రైతులు కూడా గట్లపై మొక్కలు నాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీఏలు పాల్గొన్నారు.



మొక్కలు నాటడానికి సిద్ధం చేసిన చెరువు గట్టు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

పార్వతీపురం టౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా స్టాప్ డయేరియా అనే కార్యక్రమాన్ని జూలై 1 నుంచి జూలై 31 వరకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని వీధుల్లో యాంటీ లార్వా స్ప్రేయింగ్ చేపట్టాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. మెయిన్ రోడ్ల మీద ఉన్న దుకాణాల వద్ద డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగు తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మురళి, ఏఎస్ఓ వీరునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సాలూరు: ఆశ్రమ పాఠశాలల్లో తిష్టవేసిన సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని సీపీఎం నాయకులు ఎన్‌వై నాయుడు, ప్రసాద్, రాములు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఆశ్రమ పాఠశాలల్లో పాడైన భవనాలకు మరమ్మతులు చేపట్టాలని.. ప్రతి పాఠశాలలో ఏఎన్ఎంను నియమించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అలాగే సాలూరు పట్టణానికి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను మంజూరుచేస్తూ 20.09.2023న డైరెక్టర్ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయని, ఈ విద్యా సంవత్సరం నుంచే పాఠశాలను ప్రారంభించాలని కోరారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించండి

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు అరుణకుమారి, లక్ష్మి సూచించారు. మండలంలోని రావివలస, పెదగుడబ అంగన్‌వాడీ కేంద్రాల పరిధుల్లో అంగన్‌వాడీ సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మూడేళ్ల వయసు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు ప్రభుత్వాలు కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. చిన్నారులకు ఆహ్లాదకర, స్నేహపూరిత వాతావరణంలో విద్య నేర్పించడంతో పాటు పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు హైమావతి, ప్రశాంతికుమారి, పార్వతి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



రావివలసలో అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం :ఎంపీడీఓ

గరుగుబిల్లి: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పి. సూర్యనారాయణ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో శనివారం సమావేశమైన ఆయన.. రానున్న వర్షాకాలంలో మలేరియా, డెంగీ, అతిసారం, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వాటి బారిన ప్రజలు పడకుండా పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయాలన్నారు. తాగునీటి బోర్లు, బావులు, రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది కూడా గ్రామాల్లో ఫీవర్ సర్వే చేసి, జ్వరపీడితులను గుర్తించి, వారికి సకాలంలో చికిత్స అందేలా చూడాలన్నారు. మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, ఏపీవో గౌరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

మందుల వితరణ

గుమ్మలక్ష్మీపురం: గ్రామానికి చెందిన రిటైర్డ్ వైద్యాధికారి జి.ప్రభాకరరావు మండలంలోని తాడకొండ పీహెచ్‌సీ పరిధిలోని హెల్త్ అసిస్టెంట్లకు రూ.7 వేల విలువైన మందులను శనివారం వితరణ చేశారు. గ్రామాల్లో సీజనల్ జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వాటిని నియంత్రించేందుకు అవసరమైన మాత్రలు అందజేశారు. రక్తహీనత నివారణకు ఉపయోగపడే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, ఎముకల దృఢత్వానికి అవసరమయ్యే కాల్షియం మాత్రలు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్లు ఎస్.రత్నకుమార్, పి.రాధాకృష్ణ మాట్లాడుతూ గిరిజనులకు తమవంతు సాయంగా వైద్యసేవలు అందించాలనే సదుద్దేశ్యంతో రిటైర్డ్ వైద్యాధికారి ప్రతినెలా ఈ మందు లు అందజేస్తున్నారని, వారికి తమ కృతజ్ఞతలన్నారు.



మందులు అందిస్తున్న రిటైర్డ్ వైద్యాధికారి ప్రభాకరరావు

కళాజాతా



బాలికల సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న కళాజాతా కళాకారులు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కళాజాతా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఐసీడీఎస్ పీవో విజయగౌరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాకారులు గాన, నృత్య ప్రదర్శల ద్వారా బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, బాలికల హక్కులు, సంరక్షణ చట్టాలు, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌లపై అగాహన కల్పించారు. బాలికలను రక్షిద్దాం.. చదివిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకోవడంతో విద్యార్థులు కూడా కళాకారులు చెప్పింది వినేందుకు ఆసక్తి చూపించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

అన్నసంతర్పణ



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో అన్నసంతర్పణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఉదయం సుప్రభాతసేవ, మంగళాశాసనం తదితర పూజలు చేశారు. పుట్టుదేవుని వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారికి తలనీలాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

జూలై 7న రథయాత్ర ప్రారంభం



ప్రత్యేకాలంకరణలో ఉత్సవమూర్తులు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో కొలువైన జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో జూలై 7వ తేదీ నుంచి రథయాత్ర ప్రారంభమవుతుందని యాత్ర నిర్వాహకులు తెలిపారు. అదేనెల 15వ తేదీన యాత్ర ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. శనివారం ఉదయం ఉత్సవ విగ్రహాలకు దైవస్నానం చేసి, ప్రత్యేకంగా అలంకరించారు.

సన్మానం



బ్రాంచి మేనేజర్‌ను సన్మానిస్తున్న వెలుగు సిబ్బంది

గరుగుబిల్లి: ఏపీజీవీబీలో బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లిన బ్రాంచి మేనేజర్ వి.వి.ఆర్.రెడ్డిని వెలుగు, ఉపాధి హామీ పథకం సిబ్బంది శనివారం సన్మానించారు. అనంతరం ఆయన సేవలను వక్తలు ప్రశంసించారు. తనకు విధి నిర్వహణలో సిబ్బంది ఎంతో సహకరించారని, వారికి తన కృతజ్ఞతలని సన్మాన గ్రహీత తెలిపారు. కార్యక్రమంలో వెలుగు సీసీ తిరుపతిరావు, వీవోఏలు, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



అర్చకుడికి పూజా సామగ్రి అందజేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

- క్లబ్ ప్రతినిధులు పాపారావు, విశ్వేశ్వరరావు

సీతానగరం: వాసవీ క్లబ్‌ల ద్వారా ప్రజాసేవ చేస్తున్నామని క్లబ్ రాష్ట్రస్థాయి ప్రతినిధి పాపారావు, ఇంటర్నేషనల్ ప్రొగ్రాం కో ఆర్డినేటర్ ఎం. విశ్వేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని వాసవీ క్లబ్‌లో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ. గోవిందరాజు, కె. లక్ష్మణరావు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పాపారావు, విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో 18 వందల వాసవీక్లబ్‌లు పని చేస్తున్నాయని తెలిపారు. క్లబ్ సభ్యులు సమకూర్చిన నిధులతో పేదలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ఎం. రాజేష్ ఆధ్వర్యంలో సిబ్బందికి తువ్వాళ్లు, పెన్నులు.. వేణుగోపాలస్వామి ఆలయ ప్రధానార్చకుడు పి. శ్రీనివా సాచార్యులకు పూజాసామగ్రి, 40 మంది పేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు.. కూరగాయల వ్యాపారులకు గొడుగులు అందజేశారు.

నేత్రదానానికి అంగీకారం..

వాసవీ క్లబ్ సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, ఆరిసెట్టి వెంకట సత్యనారాయణ, గోవిందరాజు, కూర్మదాసు, లక్ష్మణరావు, తదితర ఎనిమిది మంది నేత్రదానానికి అంగీకారం తెలియజేశారు. ఈమేరకు అంగీకార పత్రాలను కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాపారావుకు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి కె. వెంకటరావు, సభ్యులు పాల్గొన్నారు.

సస్యరక్షణ తప్పనిసరి

పాచిపెంట: పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ తిరుపతిరావు అన్నారు. మండలంలోని మాతుమూరు ఆర్‌బీకే పరిధిలో సాగవుతున్న పత్తి పంటను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సరైన తేమశాతం ఉన్నప్పుడు రైతులు డీఏపీ 25 కిలోలు, యూరియా 25 కిలోలు, పొటాష్ 15 కిలోలు ఒక ఎకరాకు వేసుకోవాలని తెలిపారు. కాండంతొలుచు పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ గుళికలు వేయాలని సూచించారు. రైతుభరోసా కేంద్రాల్లో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ దినేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ తిరుపతిరావు

ఆక్రమణలు తొలగించాలి



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పార్వతీపురం టౌన్: పట్టణ పరిధిలోని వరహాల గెడ్డ, చెరువుల్లోని ఆక్రమణలను తొలగించడంతో పాటు పూడికతీత పనులు వేగవంతం చేయాలని సీపీఎం పార్వతీపురం పట్టణ కమిటీ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం పట్టణ కమిటీ వరహాల గెడ్డపై నిర్మిస్తున్న కల్వర్టు పనులను, గెడ్డ పూడికలను శనివారం పరిశీలించారు. అనంతరం రెవెన్యూ అధికారి శ్రీనివాసరావును, మున్సిపల్ కమిషనర్ కోన శ్రీనివాసరావులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, నాయకుడు బంకురు సూరిబాబు మాట్లాడుతూ.. పార్వతీపురం పట్టణంలో చిన్నపాటి వర్షం పడినా వరహాల గెడ్డ పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. గెడ్డలో ఆక్రమణలు చోటుచేసుకోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని.. అధికారులకు విషయం తెలియేసినా ఎవ్వరూ చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వరహాల గెడ్డపై ఆక్రమణలను తొలగించాలని, అలాగే గెడ్డపై నిర్మిస్తున్న కాజ్‌వే పనులపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు పి. రాజశేఖర్, హెచ్. బలరాం, బెలగం శ్రీనివాసరావు, సీరియర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మైదానం కాదు గుర్రపుడెక్క



ఈ చిత్రంలో కనిపిస్తోంది పచ్చనిమైదానం అనుకుంటే పొరబడినట్లే. తోటపల్లి ప్రాజెక్ట్‌లోని నదీగర్భం ఇలా గుర్రపుడెక్కలతో నిండిపోయి అందంగా కనిపిస్తూ అటువైపుగా వెళ్లే వారి చూపును తనవైపు తిప్పుకుంటోంది. చూడటానికి ఎంతో అందంగా, ఆహ్లాదంగా కనిపించినా తొలగించడం కష్టమని అంటున్నారు. ఇవే గుర్రపుడెక్కలు సాగునీటి కాలువల్లో పెరిగితే సాగునీరు సక్రమంగా సరఫరా కాదని అంటున్నారు. అధికారులు స్పందించి, గుర్రపుడెక్క తొలగించాలని పలువురు కోరుతున్నారు.

– గరుగుబిల్లి

ఆన్‌లైన్‌లో విద్యార్థుల వివరాలు నమోదు చేయండి

గుమ్మలక్ష్మీపురం:

ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు/బాలికల పాఠశాలల్లో ఈ ఏడాది కొత్తగా చేరిన విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈవో బి.చంద్రశేఖర్, ఏటీడబ్ల్యూవో బి.సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాలలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శనివారం సమావేశమైన ఆయన.. నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బడిఈడు పిల్లలంతా ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే విద్యాప్రమాణ్ 90 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని కూడా జయప్రదం చేయాలన్నారు. విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్లు అందేలా చూడాలని, ప్రణాళికాబద్ధంగా తరగతుల వారీగా విద్యాబోధనకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.



ప్రధానోపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్, ఏటీడబ్ల్యూఓ సురేష్‌కుమార్